ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
1
RNI No: APTEL/2023/87888
మంగళవారం
09 డిసెంబర్ 2025

'వందేమాతరం' ప్రజల్లో స్ఫూర్తి నింపుతూనే ఉంటుంది:అమిత్ షా

దిల్లీ, డిసెంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. లోక్సభలో సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించగా.. మంగళవారం రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాలంతో సంబంధం లేకుండా 'వందేమాతరం' దేశ ప్రజల్లో ఎప్పటికీ స్ఫూర్తి నింపుతూనే ఉంటుందన్నారు. ఆ గేయానికి గతంలోనూ ఎంతో ఔచిత్యం ఉందని.. భవిష్యత్తులోనూ ఉంటుందన్నారు. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని.. ప్రజా సమస్యల నుంచి దేశాన్ని పక్కదారి పట్టించేందుకు వందేమాతరంపై చర్చకు తెర తీశారని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను అమిత్ షా ఖండించారు.

వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ బెంగాల్కు చెందిన వ్యక్తి అయినప్పటికీ.. ఈ గేయం కేవలం బెంగాల్కే పరిమితమైనది కాదన్నారు. వందేమాతరంపై ప్రజల్లో అభిమానం గతంలోనూ ఉందని.. భవిష్యత్తులోనూ కొనసాగుతుందన్నారు. బ్రిటిష్ వారు కూడా మన జాతీయగేయాన్ని ఆపలేకపోయారని పేర్కొన్నారు. బ్రిటిష్ సంస్కృతిని అనుసరించేవారు కూడా ఎప్పటికీ దానిని ఆపలేరన్నారు. పార్లమెంటు ఉభయసభల్లో ఈ చర్చ ద్వారా భవిష్యత్ తరాలు వందేమాతర గేయానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటారని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తంచేశారు. వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై ప్రత్యేక చర్చను సోమవారం లోక్సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మొత్తంగా ఈ చర్చ కోసం దిగువ సభలో 10 గంటల సమయాన్ని కేటాయించారు. విపక్ష కాంగ్రెస్ తరపున 'వందేమాతరం' పై లోక్సభలో పార్టీ ఉప నేత గౌరవ్ గొగొయ్, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా తదితరులు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిపెట్టుకొని ఈ చర్చకు తెరతీశారని విమర్శించారు.

ఫ్రీ హోల్డ్లోని 5,74,908 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలు పునఃపరిశీలన:సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): గత ప్రభుత్వ హయాంలో ఫ్రీ హోల్డ్లో ఉంచిన 5,74,908 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలను పునఃపరిశీలించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫ్రీ హోల్డ్లో ఉంచిన అసైన్డ్ భూములు, 22ఏ, రీ సర్వే, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఎ అధికారులు హాజరయ్యారు.



గతేడాది జూన్ 15 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 1 వరకు 5,28,217 గ్రీవెన్సులు వచ్చాయని, వీటిలో 4,55,189 పరిష్కరించగా, పరిశీలనలో మరో 73 వేల వరకు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. పాలనా సంస్కరణలతో ఈ ఏడాది జూన్ నుంచి ఆటోమ్యూటేషన్ ప్రక్రియ వేగవంతమైందన్నారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 22ఏ జాబితా నుంచి తప్పించాలని కోరుతూ 6,846 దరఖాస్తులు దాఖలయ్యాయన్నారు. ఎక్స్ సర్వీస్మెన్, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమరయోధులు, 1954 కంటే ముందు అసైన్డ్ భూములు కలిగిన వాళ్ల భూములు 22ఏ నుంచి తొలగించారని తెలిపారు. 6,693 గ్రామాల్లో రీసర్వే పూర్తిచేసి వెబ్ ల్యాండ్ 2.0లో వివరాల నమోదు చేశామన్నారు. రీసర్వేలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా భూమి రికార్డుల అప్ డేషన్ చేస్తున్నామన్నారు. 2.77 కోట్ల కుల ధృవీకరణ పత్రాలు ఆధార్ అనుసంధానం చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.10,169 కోట్ల ఆదాయం ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు సీఎంకు తెలిపారు.

తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది:రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను ఫ్యూచర్ సిటీలోని గ్లోబల్ సమిట్ ప్రాంగణం నుంచి సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ ప్రారంభించారు. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో రూ.5.8 కోట్లతో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 18 అడుగుల ఎత్తుతో విగ్రహాల నిర్మాణం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... "తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉంది. 2009లో ఇదే రోజు (డిసెంబర్ 9) తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. 6 దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది. ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి ఆవిష్కరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. తెలంగాణ తల్లిని తలుచుకుని పనులు మొదలు పెట్టేందుకే విగ్రహాలు ఆవిష్కరించాం. స్వరాష్ట్ర కల నిజమై.. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్గా రూపొందుతోంది. సోనియా గాంధీ ఎన్నో అడ్డంకులు అధిగమించి మరీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం డిసెంబరు 9న కావడం మా అందరికీ సంతోషాన్ని కలిగించే పర్వదినం. ఏటా తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాలతో పాటు, సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను తెలంగాణ ప్రజలు నిర్వహించుకుంటారు. మా పథకాలు, కార్యక్రమాల్లో సోనియా, మన్మోహన్ స్ఫూర్తి కొనసాగుతోంది" అని రేవంత్రెడ్డి అన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

జపాన్లో భూకంపం.. ప్రభాస్ సేఫ్ అని క్లారిటీ ఇచ్చిన దర్శకుడు

ప్రస్తుతం ప్రభాస్ జపాన్లో ఉన్న విషయం తెలిసిందే. అయితే, తాజాగా జపాన్ ఉత్తర తీరంలో భారీ భూకంపం సంభవించడంతో ఆయన అభిమానులు ఆందోళన చెందుతూ పోస్టు పెడుతున్నారు. వారికి దర్శకుడు మారుతి రిప్లై ఇచ్చారు. ప్రభాస్ క్షేమంగా ఉన్నారని తెలిపారు. 'జపాన్లో భూకంపం వచ్చింది. సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మా హీరో ఎక్కడ ఉన్నాడు. ఈరోజు సాయంత్రం రిటర్న్ అవుతాడా? ' అని ఓ అభిమాని మారుతిని అడుగుతూ పోస్ట్ పెట్టాడు. దీనికి ఆయన స్పందిస్తూ.. 'ప్రభాస్తో ఇప్పుడే మాట్లాడాను. భూకంపం వచ్చిన ప్రాంతంలో ఆయన లేరు. ఆయన క్షేమంగా ఉన్నారు. ఆందోళన చెందకండి' అని రిప్లై మారుతి పెట్టారు. దీంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. 'బాహుబలి: ది ఎపిక్' డిసెంబర్ 12న జపాన్లో విడుదల కానున్న సందర్భంగా ప్రచారంలో భాగంగా ప్రభాస్ అక్కడికి వెళ్లారు. అక్కడి అభిమానులతో కలిసి సందడి చేస్తున్నారు. ఇక మరోవైపు మారుతి-ప్రభాస్ కాంబోలో రానున్న 'ది రాజాసాబ్' ప్రచార పనులను షురూ చేసింది. ఈ మూవీ జనవరి 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దీనిలోని రెండో పాటను త్వరలోనే రిలీజ్ చేయనున్నట్లు సమాచారం.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

మాటల్లేవ్.. మాట్లాడుకోవడాల్లేవ్!: ఫిల్సాల్ట్

ఇంగ్లాండ్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ ఫిల్సాల్ట్ మైదానంలో.. ముఖ్యంగా బ్యాటింగ్ సమయంలో విరాట్ కోహ్లితో తనకున్న అనుబంధాన్ని గురించి ఓ పాడ్కాస్ట్లో మాట్లాడాడు. ఓపెనింగ్ భాగస్వామితో మంచి అనుబంధం, సమన్వయం ఉండాలన్నాడు. అది ఐపీఎల్లో తనకు, విరాట్ కోహ్లి మధ్య ఉందన్నాడు. 'మీరు ఎవరితో ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేస్తున్నారో.. వారితో మంచి అనుబంధాన్ని కలిగిఉండాలి. వారు ఎలా ఆడతారో మీరు అర్థం చేసుకోవాలి. అలాగే వారికి కూడా మీ ఆటపై అవగాహన ఉండాలి. మేమిద్దరం ఇక్కడికి వచ్చిన క్షణం నుంచే మా మధ్య అనుబంధం ఏర్పడింది' అని ఫిల్సాల్ట్ అన్నాడు.'మేం ఎలా ఆడతామనే విషయంలో మా ఇద్దరికీ పరస్పర అవగాహన ఉంది. ఉదాహరణకు జైపుర్లో మేం పెద్దగా మాట్లాడుకోలేదు. అయినా చక్కటి సమన్వయంతో ఆడాం. దిల్లీలోనూ అంతే. కొన్నిసార్లు మేమిద్దరం షాట్ల గురించి మాట్లాడుకుంటాం. మరి కొన్నిసార్లు ఆ అవసరం రాదు. సహజంగా జరిగిపోతుంది' అని ఫిల్సాల్ట్.. తనకు, విరాట్కు మధ్య ఉన్న సమన్వయం గురించి వివరించాడు. అలాగే ప్రస్తుతం టీ20ల్లో అటాకింగ్ బ్యాటింగ్ ట్రెండ్ నడుస్తోంది. దీనిపై కూడా ఫిల్సాల్ట్ మాట్లాడాడు. 'ప్రస్తుతం క్రికెట్లో దూకుడు పెరిగింది. ముఖ్యంగా బ్యాటర్లు అటాకింగ్ మోడ్లో ఆడుతున్నారు. ఒకప్పుడు ఒక బ్యాటర్ ఆరెంజ్ క్యాప్ కోసం ముందుకుసాగాలని ఆలోచించేవాడు. కానీ ఇకపై ఐపీఎల్ లో ఇది పనిచేయదు. మా జట్టులోని ఆటగాళ్ళు వ్యక్తిగత అవార్డుల కోసం కాకుండా.. జట్టు విజయం కోసమే ఆడతారు' అని ఫిల్సాల్ట్ తెలిపాడు. 2025 సీజన్ కు ముందు ఆర్సీబీ 11.50 కోట్లకు ఫిల్సాల్ట్ను సొంతం చేసుకుంది. మరికొన్ని రోజుల్లో జరగనున్న వేలానికి ముందు జట్టు రిటైన్ చేసుకున్న ఆటగాళ్లలో సాల్ట్ ఒకరు. ఆర్సీబీ దాదాపు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ 2025 సీజన్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. విరాట్కోహ్లి తన నిలకడైన ప్రదర్శనతో వరుసగా మూడో సీజన్లో 600లకు పైగా పరుగులు సాధించి, ఆర్సీబీని విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించాడు.

ఇంటి చిట్కాలు

కాకరకాయ చేదుగా ఉంటుందని తినట్లేదా, ఇంట్లోని కొన్ని పదార్థాలు కలిపి వండితే చేదు తగ్గి రుచి పెరుగుతుంది

కాకరకాయ.. ఈ కూరగాయ ఎంతో ఆరోగ్యకరమైనప్పటికీ ఎక్కువగా చేదుగా ఉండడం వల్ల ఎక్కువగా ఇష్టపడరు. కానీ, ఇందులో చేదుతనాన్ని కూడా ఈజీగా తగ్గించుకోవచ్చు. అదెలానో తెలుసుకోండి.

కాకరకాయ చేదు ఉంటుందందని చాలా మంది తినరు. కానీ, ఈ చేదు కూరగాయతో బోలెడు లాభాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల షుగర్ ఉన్న వారి దగ్గర్నుంచీ చాలా సమస్యలకి చెక్ పెట్టొచ్చు. అందుకే, కాకరకాయని వారానికి ఓ సారైనా తినాలి. అయితే, కాకరకాయలో చేదుని తగ్గించేందుకు చాలా మంది వాటిని కట్ చేసి ఆరబెడుతుంటారు. దీని వల్ల చేదు తగ్గుతుంది. అయితే, అందరికీ అలా వీలవ్వదు. ఇష్టముండదు. అలాంటప్పుడు చేదుని ఎలా తగ్గించాలి.. ఏయే టిప్స్ ఫాలో అయితే, చేదు తగ్గుతుంది. కూర రుచి పెరుగుతుంది.

పీల్ చేయడం



అదే విధంగా, కాకరకాయని పీల్ చేయండి. అప్పుడు కాకరకాయలోని చేదు తగ్గుతుంది. కారణం కాకరకాయలోని పై చర్మమే ఎక్కువగా చేదు ఉంటుంది. దీనికోసం పీలర్ వాడొచ్చు. పీల్ చేయడం వల్ల కూడా కాకరకాయలోని చేదు తగ్గుతుంది. అదే విధంగా, లోపలి గుజ్జు, గింజల్ని తీసేయండి.

పెరుగు

కాకరకాయల్ని చిన్న ముక్కలుగా కట్ చేసి వాటిని కొద్దిగా సేపు ఉప్పు కలిపిన మజ్జిగలో ఉంచండి. దీని వల్ల చేదు తగ్గుతుంది. కూర చక్కగా టేస్టీగా ఉంటుంది. కూర వండేటప్పుడు పెరుగు కలపడం వల్ల కూర రుచిగా ఉంటుంది.

కొబ్బరినీటిలో

అదే విధంగా, కొబ్బరినీటిని వాడడం వల్ల కూడా చేదు గుణం తగ్గుతుంది. ఇందుకోసం కొబ్బరినీటిలో 10 నుంచి 15 నిమిషాల పాటు కాకరకాయ ముక్కల్ని కొబ్బరినీటిలో ఉంచాలి. దీని వల్ల కూడా చేదు తగ్గుతుంది. తర్వాత కూర వండుకోవచ్చు.

ఉప్పు చల్లడం

అదే విధంగా కాకరకాయల్ని చిన్న ముక్కలుగా కట్ చేసి వాటిని శుభ్రంగా కడగాలి. తర్వాత వాటిపై కొద్దిగా ఉప్పు చల్లాలి. తర్వాత 10 నుంచి 15 నిమిషాలు ఉంచితే చేదు తగ్గుతుంది. దీనిని రాత్రుళ్లు కూడా ఫాలో అవ్వొచ్చు. దీని వల్ల ఉప్పులోని గుణం చేదుని తగ్గిస్తుంది.

ఉప్పు నీటిలో ఉడికించడం

కాకర కాయని చిన్నగా కట్ చేసి వీటిని చక్కగా క్లీన్ చేసి ఉప్పు నీటిలో ఉడికించండి. ఇలా చేస్తే కాకరకాయలోని చేదు తగ్గుతుంది. ఎండబెట్టాల్సిన అవసరం కూడా లేదు. అయితే, ఉప్పు మరీ ఎక్కువగా వేయకూడదు. కాసింత వేస్తే సరిపోతుంది. మళ్లీ వండుకున్నప్పుడు రుచి చూసి మాత్రమే ఉప్పు కలపాలని గుర్తుంచుకోండి. లేదంటే కూరలో ఉప్పు ఎక్కువయ్యే అవకాశం ఉంది.

నిమ్మరసం

అదే విధంగా, మనం కాకరకాయని వండేటప్పుడు కొద్దిగా పులుపుగా ఉండే నిమ్మరసం, వెనిగర్ వంటివి వేయండి. దీని వల్ల చేదు బ్యాలెన్స్ అవుతుంది. రుచి కూడా పెరుగుతుంది. ఇప్పుడు చెప్పేవన్నీ కూడా ఇంట్లో లభించే పదార్థాలే కాబట్టి, హ్యాపీగా వీటిని వాడి చేదులేని కాకరకాయ కూరని ఎంజాయ్ చేయొచ్చు.